క్లుప్తంగా

మెట్టలో ముమ్మరంగా వరి నాట్లు



రంగంపేట మండలంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

రంగంపేట: మెట్టప్రాంతమైన రంగంపేట మండలంలో గత కొద్ది రోజులుగా వాతావరణం అనుకూలించి వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. ఖరీఫ్ సీజన్‌లో మండలంలో 2,876 హెక్టార్లలో వరి నాట్లు వేయాల్సి ఉండగా ప్రస్తుతం 1,200 హెక్టార్లలో నాట్లు పూర్తయ్యాయి. జులై నెలాఖరు నాటికి పూర్తిస్థాయిలో నాట్లు పూర్తవుతాయని మండల వ్యవసాయాధికారి కూరాకుల శ్రీనివాసరావు తెలిపారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచామన్నారు.

సూర్యదేవునికి పంచామృతాభిషేకాలు



ప్రత్యేక అలంకరణలో ఉన్న సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత సూర్యదేవునికి ఆదివారం ఆలయంలో ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామిని, దేవేరుల్ని ప్రత్యేకంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామిని దర్శించుకున్నారు. భక్తుల కోసం ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

అన్నసమారాధన

మధురపూడి: కోరుకొండ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో అన్నసమారాధన కొనసాగుతోంది. ఆదివారం పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు. వారందరికీ ఆలయంలో భోజన సదుపాయం కల్పించారు.

250 మందికి వైద్య సేవలు



వైద్యసేవలు అందిస్తున్న వైద్యుడు

మధురపూడి: కోరుకొండ మండలం గరలంపాలెంలో ఆదివారం వైద్యశిబిరం నిర్వహించారు. రాయల్ హాస్పటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో 250 మందికి వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్, జనరల్, గ్యాస్ట్రిక్, కీళ్ల నొప్పులు, గుండె సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించి, మందులు అందించారు. రాయల్ హాస్పటల్ డాక్టర్లు దీపక్, శివ వైద్య పరీక్షలు జరిపారు. సర్పంచ్ బోడపాటి నాగలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకుడు అరవాలు రాజు ముందుగా ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు కొండబాబు, గొల్లకోటి మల్లికార్జునరావు, కన్నూరి కృష్ణ, రాపర్తి వీరపండు, రాంబాబు పాల్గొన్నారు.

కార్యాలయం ప్రారంభం



పార్టీ జెండాను ఎగురవేస్తున్న నాయకులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలో సీపీఐ ఎంఎల్ కార్యాలయాన్ని ఆ పార్టీ రాష్ట్ర కమిటీ నాయకుడు, జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు ఆదివారం ప్రారంభించారు. ముఖ్యఅతిథిగా వ్యవసాయ కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఏనుగుపాటి అర్జునరావు విచ్చేశారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగురవేశారు.

మొహర్రం ర్యాలీ

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో ఆదివారం మొహర్రం ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ఆస్థాన ముత్తు వల్లి షేక్ రబ్బాని ఆధ్వర్యంలో ద్రాక్షారామ, బిక్కవోలు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ముస్లింలు ర్యాలీలో పాల్గొన్నారు. అనంతరం మజ్లిస్ చదివారు.

ముగిసిన కేంద్ర బృందం పర్యటన

రాజమహేంద్రవరం రూరల్: జాతీయ ఆరోగ్య మిషన్ జనాభా పరిశోధన మానిటరింగ్ బృందం (కేంద్ర బృందం) జిల్లాలో చేపట్టిన మూడురోజుల పర్యటన ముగిసిందని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఆ బృందంలోని అధికారులైన డాక్టర్లు రాజేష్, జే.నాయర్, ఎంసీ మాథ్యూస్ గోకవరం, కోరుకొండ సామాజిక ఆరోగ్య కేంద్రాలను, అనపర్తి ఏరియా ఆసుపత్రిని సందర్శించారన్నారు.

ఎప్పుడైనా విన్నామా.. కన్నామా..

- ఇంటికొచ్చి సేవలందిస్తున్న ప్రభుత్వ వైద్యులు
- ఫ్యామిలీ డాక్టర్ విధానంపై సర్వత్రా హర్షం

అనపర్తి నియోజకవర్గంలో..

సీహెచ్‌సీలు	– 2
పీహెచ్‌సీలు	– 7
విలేజ్ క్లినిక్‌లు	– 70
నమోదైన ఓపీ	– 1,05,261 మంది
బీపీ, షుగర్ పరీక్షలు	– 63,281 మందికి



కొంకుదురులో ఫ్యామిలీ డాక్టర్ సేవలను అందిస్తున్న వైద్య సిబ్బంది



కాటవరంలో వైఎస్సార్ హెల్త్ క్లినిక్ భవనం

బిక్కవోలు: ఒకప్పుడు ప్రభుత్వాసుపత్రికి వెళితే క్యూలైన్లలో నించుని గంటల తరబడి వేచి చూస్తే తప్ప వైద్యుడిని కలిసే అవకాశం దక్కేది కాదు. అలాంటిది ప్రభుత్వ వైద్యులే స్వయంగా ఇంటింటికీ వచ్చి చికిత్స అందిస్తుంటే ప్రజలకు అంతకంటే ఇంకేం కావాలి. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానంలో ప్రతి సచివాలయం పరిధిలో నెలకు రెండు పర్యాయాలు ప్రజల ఇళ్ల వద్దకే వైద్యులు వెళ్లి వైద్యం అందిస్తున్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా వైద్యులే ఇంటికొచ్చి చికిత్స అందిస్తుండడంపై ఎప్పుడైనా ఇది విన్నామా కన్నామా అంటూ గ్రామీణ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

తగ్గుతున్న వైద్య ఖర్చులు

నిరుపేదలకు సైతం కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



వైద్య రంగానికి పెద్ద పీట వేస్తూ ఎన్నో సంక్షేమ పథకాలను అమలుచేస్తున్నారు. దీంట్లో భాగంగా తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంపై ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుంది. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ పరిధిలోని ఇద్దరు డాక్టర్లు, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశ కార్యకర్త సహకారంతో ఆయా గ్రామాల్లోని విలేజ్ క్లినిక్ లేదా సచివాలయం వద్ద వైద్య సేవలు అందిస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకూ ఓపీ చూస్తున్నారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం 4 గంటల వరకూ ప్రమాదాలు, వివిధ అనారోగ్య కారణాలతో మంచాన పడిన రోగులు, బీపీ, షుగరు వ్యాధిగ్రస్తులతో పాటు గర్భిణులు, బాలింతల వద్దకు వెళ్లి చికిత్స చేస్తున్నారు. కార్యక్రమంలో 14 రకాల రక్త పరీక్షలు నిర్వహించి రోగ నిర్ధారణ చేసి, 105 రకాల మందులను రోగులకు అందిస్తున్నారు. ప్రధానంగా పక్షవాతం, ఆర్థరైటిస్, గుండెజబ్బులు, క్యాన్సర్, ఆస్తమా లాంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరంగా మారింది.

రాజానగరం నియోజకవర్గంలో..

సీతానగరం: రాజానగరం నియోజకవర్గానికి 73 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు మంజూరయ్యాయి. సీతానగరం మండలంలోని 19 క్లినిక్‌ల్లో ఆరు పూర్తి చేసి వైద్యశాఖకు అప్పగించారు. పది భవనాలు వివిధ దశల్లో ఉండగా, మునికూడలి, రఘుదేవపురం1, పురుషోత్తపట్నాలలో ప్రతిపాదనలు పంపించారు. భవనాలు లేనిచోట సచివాలయాలు, ఆర్బీకేల్లో నిర్వహిస్తున్నారు. రాజానగరం మండలంలో 31 భవనాలకు 30 మంజూరయ్యాయి. ఫరిజల్లిపేటలో మంజూరు కావాల్సి ఉంది. 29 భవనాలు పూర్తవ్వగా, మల్లంపూడిలో చివరి దశకు చేరుకుంది. కోరుకొండ



సీతానగరం వైఎస్సార్ క్లినిక్‌లో వైద్యసేవలు

మండలంలో 23 వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ప్రతి రోజూ 30 నుంచి 70 వరకూ ఓపీలు వస్తున్నాయి. అలాగే ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా వైద్యులు ప్రతి గ్రామంలో సేవలు అందిస్తున్నారు. మంచం మీద ఉన్న రోగుల ఇళ్లకు వెళ్లి వైద్యం చేస్తున్నారు. రెండు నెలల్లో సీతానగరం మండలంలో 9 వేల మంది, రాజానగరం మండలంలో 18 వేల మంది, కోరుకొండ మండలంలో 10 వేల మంది వైద్యసేవలు పొందారు.

వైద్యసేవలు బాగున్నాయి



ఏఎంఎంలు, ఆశావర్కర్లు ప్రతి వారం మాకు వైద్య సేవలు అందిస్తున్నారు. ఏమైనా సమస్య వచ్చి వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌కు వెళితే తక్షణమే వైద్యం అందుతోంది. నేను గర్భిణిని. రక్తహీనత రాకుండా తీసుకోవాల్సిన ఆహారంపై అవగాహన కల్పించి, మందులు ఇస్తున్నారు. ముఖ్యమంత్రి జగనన్న వైద్యసేవలు మంచిగా అందిస్తున్నారు.

– బూసి మమత, గర్భిణి, కూనవరం

సమయానికి టీకాలు



నా బిడ్డకు సమయానికి టీకాలు వేస్తున్నారు. ఎప్పటికప్పుడు నాకు అవగాహన కల్పిస్తున్నారు. బాలింతనైన నేను ఏ ఆహారం తీసుకోవాలో చెబుతున్నారు. మందులన్నీ ఉచితంగా అందిస్తున్నారు. అవసరమైతే ఇంటివద్దకే వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారు. జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత మాలాంటి వారికి వైద్యసేవలు చక్కగా అందుతున్నాయి.

– జొన్నకూటి రాణి, బాలింత, రఘుదేవపురం

చాలా సంతోషంగా ఉంది



నా వయసు 77 సంవత్సరాలు. నాకు బీపీ, షుగరు ఎక్కువై మంచం పెట్టాను. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ డాక్టర్లు నెలకు రెండు సార్లు మా ఇంటికొచ్చి పరీక్షలు చేసి ఉచితంగా మందులిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

– గొర్తి సూరమ్మ, వృద్ధురాలు, బిక్కవోలు

ఇంతటి సాయం ఎవరూ చేయలేదు



నా వయసు 82 సంవత్సరాలు. నాకు బీపీ, షుగర్‌తో పాటు పక్షవాతం వచ్చింది. మంచానికే పరిమితమయ్యాను. ఫ్యామిలీ డాక్టర్ విధానం వచ్చాక వైద్యులే ఇంటికొచ్చి చికిత్స అందిస్తున్నారు. నాలాంటి వాళ్ల కోసం ఇంతటి సాయం గతంలో ఏ ముఖ్యమంత్రి చేయలేదు.

– చింతా బ్రహ్మారెడ్డి, వృద్ధుడు, కొమరిపాలెం

బీజాపురి టౌన్‌షిప్ కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

రాజానగరం: దివాన్‌చెరువులోని బీజాపురి టౌన్‌షిప్ వెల్ఫేర్ అసోసియేషన్‌కి ఆదివారం నూతనంగా ఎన్నికలు జరిగాయి. అధ్యక్ష, కార్యదర్శులుగా డీసీహెచ్‌కే రాజు, డాక్టర్ వై.వెంకట్, ఉపాధ్యక్షుడిగా వీవీఆర్ నాయుడు, సంయుక్త కార్యదర్శిగా పి.రవి కుమార్, కోశాధికారిగా మంగెన అప్పారావు ఎన్నికయ్యారు. గౌరవాధ్యక్షులుగా వి.శ్రీనివాసరాజు, డీకే విశ్వేశ్వరరావు, ముఖ్య సలహాదారుగా ఆర్‌ఎస్ వెంకటేశ్వరరావును ఎన్నుకున్నారు.

యోగా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రకాశం నగర్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక సత్యసాయి ధ్యాన మండలిలో జిల్లాస్థాయి యోగాసనాల పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి జూనియర్ సివిల్ జడ్జి కృష్ణ ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై, విజేతలకు బహుమతులు అందజేశారు. ట్రెడిషనల్, ఆర్టిస్ట్ సోలో సబ్ జూనియర్ బాలురు విభాగంలో కార్తిక్ రామచంద్రారెడ్డి, బాలికల విభాగంలో వెలుగుబంటి సాత్విక, జూనియర్ కేటగిరిలో అనపర్తికి చెందిన ఎస్.అవినాష్ రెడ్డి ప్రథమస్థానాల్లో నిలిచారు. అసోసియేషన్ ముఖ్య కార్యదర్శి వి.శ్రీధర్ రెడ్డి, కోశాధికారి కరిబండి రామకృష్ణ, సత్యసాయి ధ్యాన మండలి జిల్లా అధ్యక్షుడు గుత్తుల వీరభద్రరావు పాల్గొన్నారు.

27న విగ్రహావిష్కరణ

రాజమహేంద్రవరం రూరల్: శాటిలైట్ సిటీలో ఏర్పాటు చేసిన ప్రముఖ జానపద కళాకారుడు, బుర్రకథ సామ్రాట్ విభూతి బాబూరావు విగ్రహాన్ని ఈనెల 27వ తేదీ ఉదయం రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత ఆవిష్కరించనున్నారు. ఈ విషయాన్ని విభూతి బ్రదర్స్ జానపద కళాకారుడు విభూతి లోవరాజు ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు, నగర ప్రముఖులు పాల్గొంటారన్నారు. ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కోఆర్డినేటర్‌గా పనిచేసిన విభూతి బాబూరావు కరోనాతో మృతి చెందారన్నారు.

అవినీతి రహిత పాలనతో అందరికీ ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపర్తిలో గడప గడపకూ మన ప్రభుత్వం

అనపర్తి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి రహితంగా పాలన అందిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. మండలంలోని పెదపర్తిలో ఆదివారం రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రతిఒక్కరినీ పలకరిస్తూ, వివిధ సంక్షేమ పథకాల ద్వారా ప్రభుత్వం అందించిన సాయం వివరాలు తెలియజేసే పత్రాలను అందిస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ నవరత్నాలతో పేదల తలరాతలు మారుతున్నాయన్నారు. గడప గడపకూ కార్యక్రమంలో ఇంటింటా ప్రజల నుంచి అపూర్వ ఆదరణ, ఆప్యాయత దక్కుతున్నాయని చెప్పారు. సంక్షేమ పథకాల అమలులో కుల, మత, రాజకీయాలకు అతీతంగా నిరుపేదలందరికీ ఆర్థికంగా బాసటగా నిలుస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి అందరి



సంక్షేమ పథకాల లబ్ధికి సంబంధించిన కరపత్రాన్ని మహిళకు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

దీవెనలు అందజేయాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్లమిల్లి కాంతమ్మ అమ్మిరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లిరెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్తి రామకృష్ణారెడ్డి, పెడపర్తి, కుతుకులూరు ఎంపీటీసీలు తమలంపూడి మణి సత్యనారాయణరెడ్డి, సత్తి దొరయ్యరెడ్డి, ఉపసర్పంచ్‌లు మల్లిడి శ్రీనివాసరెడ్డి, సబ్బెళ్ల నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉధృతంగా గోదావరి ప్రవాహం

సీతానగరం: అఖండ గోదావరి వరద కొంతమేర తగ్గినా, ప్రవాహం మాత్రం ఇంకా ఉధృతంగానే ఉంది. ములకల్లంకకు నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచంతో సంబంధాలు లేవు. వరద నేపథ్యంలో వివిధ శాఖల అధికారులను ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అప్రమత్తం చేశారు. తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. జాలిమూడి వద్ద కోతకు గురైన ఏటిగట్టు వద్ద ఏడాది క్రితం ఇసుక బస్తాలు వేసి రక్షణ చర్యలు చేపట్టిన ప్రాంతంలో అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ఇసుకను సిద్ధంగా ఉంచారు. అత్యవసర పరిస్థితిలో ఇసుక బస్తాలతో ఏటిగట్టును పటిష్టం చేస్తామని ఏజీఎల్‌బీ ఏఈ శివ ప్రసాద్ తెలిపారు. గోదావరి వరద ములకల్లంక గ్రామంలోకి ఇంకా రానందున ఎటువంటి భయాందోళనలకు గురికావాల్సిన పని లేదని పంచాయతీ కార్యదర్శి రజాక్ 'సాక్షి'కి తెలిపారు. గ్రామంలో పారిశుద్ధ్య చర్యలకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.



ములకల్లంక - బొబ్బిల్లంక మధ్య గోదావరి ప్రవాహం

ఆర్వోప్లాంట్ ద్వారా తాగునీటికి ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధికారులతో చర్చించి, రెండు బోటులను ఏర్పాటు చేయించడంతో ప్రజలు వాటిపై ప్రయాణం చేస్తున్నారు. తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ రాజు, ఎంపీడీవో కె.రమేష్ సిబ్బందిని అప్రమత్తం చేశారు.

మానవ సంస్కృతీ సారమే నాట్యం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): మానవ సంస్కృతీ సారమే నాట్యమని నిరూపించిన మహోన్నతుడు నటరాజ రామకృష్ణ అని ఉన్నత విద్యాశాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆచార్య చప్పిడి కృష్ణ అన్నారు. కళాప్రియ నత్య కళాక్షేత్రం, రాజమహేంద్రవరం నాట్య గురువుల సంయుక్త నిర్వహణలో స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో రెండోరోజు ఆదివారం జరిగిన నటరాజ రామకృష్ణ శత జయంత్యుత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన జీవిత కాలాన్ని నాట్యం కోసం వెచ్చించిన గొప్ప తపోధనుడు నటరాజ అని కొనియాడారు. వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ ఆనాటి మహా పురుషులను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్య తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ సాహిత్యకారుడిగా నటరాజ రామకృష్ణ గురించి తెలుసుకోవాల్సిన అంశాలు ఎన్నో ఉన్నాయని, వారు రాసిన 50 పుస్తకాలే అందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పీవీ సంజీవరావు, నాట్యాచార్య ఆచంట చంద్రశేఖర్, డాక్టర్ ఏ.ఆంజనేయులు, రెడ్డి ఉమారాణి, మేడిద నాగేశ్వరరావు, సప్ప యశోదకృష్ణ, పల్ల దుర్గాప్రసాద్, గాయత్రీ పట్నాయక్, జీవీ నారాయణ, అడ్డాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా మహా కుంభాభిషేకం



కలశాలతో పవిత్ర జలాన్ని తీసుకొస్తున్న కన్నె పిల్లలు, ముత్తైదువులు

రంగంపేట: మండలంలోని వడిశలేరు గ్రామంలో ఏడీబీ రోడ్డు పక్కన నూతనంగా పునర్నిర్మించిన విజయదుర్గ అమ్మవారి ఆలయం వద్ద స్థానిక పండితులు రేగడమిల్లి రాందేవ్‌శర్మ ఆధ్వర్యంలో ఆదివారం మహా కుంభాభిషేకం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామ ఇలవేల్పు దండు గంగమ్మ ఆలయం నుంచి 300 మంది కన్నెపిల్లలు, ముత్తైదువులు, సువాసినీలు కలశాలతో పవిత్ర పూజాజలాన్ని తీసుకొచ్చి విజయదుర్గకు హరిద్రాభిషేకం, కుంకుమాభిషేకం, మహా కుంభాభిషేకం చేశారు. లోక సంక్షేమం, వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండాలనే లక్ష్యంతో మహా కుంభాభిషేకం నిర్వహించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరవడంతో ఆలయం చుట్టుపక్కల ప్రాంతాల్లో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

నెరవేరిన కల.. ఆనంద హేల

- 20 ఏళ్లుగా ఆధునీకరణకు నోచుకోని కుమారప్రియం రోడ్డు
- ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి చొరవతో సీసీ రోడ్డు నిర్మాణం

పెదపూడి: చుట్టుపక్కల పది గ్రామాలకు పైగా రాకపోకల సంబంధాలున్న మార్గమది. ఎక్కడ చూసినా గోతులతో అధ్వానంగా తయారైంది. గత రెండు దశాబ్దాలుగా ఆధునీకరణకు నోచుకోలేదు. ప్రజలు మొత్తుకుంటున్నా గత పాలకులు పట్టించుకోలేదు. కాని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ప్రజలు పడుతున్న ఇబ్బందులు చూసి వెంటనే నిధులు మంజూరయ్యేలా చేసి శరవేగంగా సిమెంటు రోడ్డు నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అదే పెదపూడి మండలం కుమారప్రియం రోడ్డు..

రూ.25 లక్షలతో రోడ్డు నిర్మాణం

కుమారప్రియం గ్రామంలోని మెయిన్‌రోడ్డు సుమారు అర కిలోమీటరు మేర దారుణంగా దెబ్బతింది. రాళ్లు పైకి తేలి ప్రమాదకరంగా తయారైంది. ఈ రోడ్డు మీదుగా పెదపూడి, కైకవోలు, శహపురం, పుట్టకొండ, సంపర, చింతపల్లి, వేండ్ర, రామచంద్రపురం, జి.మామిడాడ తదితర గ్రామాలకు వెళుతుంటారు. కుమారప్రియం రోడ్డు కొన్ని గ్రామాలకు దగ్గర కావడంతో ప్రయాణికులు ఈ రోడ్డుపైనే రాకపోకలు సాగిస్తుంటారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి చొరవ తీసుకుని ఆ రహదారిని సిమెంటు రోడ్డుగా ఆధునీకరణ పనులు జరిపిస్తున్నారు. గ్రామంలోని పెమ్మనబోయిన నారాయణమూర్తి పొలం వద్ద నుంచి ఎస్సీపేట చివర కాలువ వరకూ సుమారు 463 మీటర్ల పొడవు, 3.75 మీటర్ల వెడల్పుతో జెడ్పీ నిధులు



కుమారప్రియంలో నిర్మిస్తున్న సిమెంట్ రోడ్డు

రూ.20 లక్షలు, ఎంపీపీ నిధులు రూ.5 లక్షలతో నిర్మాణం జరుగుతుంది. మరో వారం రోజుల్లో రోడ్డు నిర్మాణం పూర్తి కానుండడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు



కుమారప్రియం రహదారి గత 20 ఏళ్లుగా ఆధునీకరణకు నోచుకోక చాలా ఇబ్బందులు పడ్డాం. ఆ రహదారిని సిమెంట్ రోడ్డుగా మారుస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు. ఆయనకు రుణపడి ఉంటాం.

– పెమ్మనబోయిన సత్తిబాబు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్, కుమారప్రియం

మళ్లీ ఎమ్మెల్యేని గెలిపించుకుంటాం



ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని కుమారప్రియం మెయిన్‌రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి ఆధునీకరిస్తున్నారు. సిమెంట్ రోడ్డు నిర్మాణంతో మా కష్టాలు తొలగాయి. అన్నింటా మాకు అండగా ఉంటున్న ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణరెడ్డిని మళ్లీ గెలిపించుకుంటాం.

– మంగం సత్యనారాయణ, గ్రామ పెద్ద, కుమారప్రియం

మణిపూర్‌లో దాడులను అరికట్టాలి

ఉండ్రాజవరం: మణిపూర్ రాష్ట్రంలో జరుగుతున్న అమానుష దాడులను అరికట్టాలని అరుణ సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కత్తుల ప్రకాష్ అన్నారు. తాడిపర్రు గ్రామంలో ఆదివారం ఆయన మాట్లాడారు. మణిపూర్ రాష్ట్రంలో జరిగిన సంఘటనలు యావత్‌భారత జాతిని తలదించుకునేలా చేసిందన్నారు. ఆడవారిపై జరుగుతున్న అత్యాచారాలకు కారణమైన దోషులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇంత జరుగుతున్న బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

ఆచూకీ తెలిస్తే తెలియజేయండి

సీతానగరం: బొబ్బిల్లంక – జాలిమూడి మధ్య గోదావరిలో శనివారం సుమారు 20 నుంచి 30 ఏళ్ల వ్యక్తి మృతదేహం కొట్టుకు వచ్చిందని, అతడి ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్సై కె.చిరంజీవి అన్నారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీలో మృతదేహాన్ని ఉంచామన్నారు. తలను ట్రిమింగ్ చేశారని, గెడ్డం ఉందన్నారు. గుండ్రని ముఖం, చామన ఛాయలో ఉన్నాడన్నారు. వివరాలు తెలిస్తే 94409 04832, 94408 36867 నంబర్లకు సమాచారం ఇవ్వాలన్నారు.